క్లుప్తంగా

నేడు సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని ఖాదర్‌బాద్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ లీకేజిని అరికట్టే చర్యల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ నరసింహారెడ్డి తెలిపారు. ఈ కారణంగా ఖాదర్‌బాద్, కొత్తపల్లె, లింగాపురం, కానపల్లె, రేగుళ్లపల్లె, నంగనూరుపల్లె, తాళ్లమాపురం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి పాలిసెట్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100 పాలిసెట్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మే 10న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తారని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వేగంగా ఆయుష్మాన్ భారత్ నమోదు

చాపాడు : మండల వ్యాప్తంగా జరుగుతున్న ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామ వలంటీర్ల చేత నమోదు చేయించాలన్నారు. ఇప్పటికే 85 శాతం మేరకు పూర్తయిందని, మిగిలిన వారికి నమోదు చేయాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు, మామిడి పండ్లు ఇస్తున్న ఖాదర్‌వలి

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్‌లో పండ్ల వ్యాపారి (దస్తుమియా అండ్ సన్స్) ఖాదర్‌వలి బడే రాత్ సందర్భంగా దివ్యాంగులకు మంగళవారం నూతన దుస్తులు, మామిడి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం అల్లా తమకు ఇచ్చిన దైవకార్యమని తెలిపారు. ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల, వయో వృద్ధుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు, సావిత్రి, సుభాన్‌బీ, బాషా, సంజీవ్ కుమార్, శ్రీను, అంజనీకుమార్, నాగరాజు, ఖాదర్ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ



సరుకులు ఇస్తున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రంజాన్ మాసం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి నిత్యావసర సరుకులు అందించారు. దాత కట్టుబడి అబ్దుల్ రసూల్ కుమారుడు కె.చాంద్ బాషా సహకారంతో రంజాన్ తోఫాలో భాగంగా నిత్యావసర సరుకులు అందించినట్లు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్ రెడ్డి, కె.చాంద్‌బాషా, మహమ్మద్ బాషా, వెంకటసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు, పవన్, మాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మాసాపేట- కేసీ కాలువ వరకూ రోడ్డు మధ్యలో మీడియన్ల నిర్మాణాన్ని రూ.21.50 లక్షలతో చేపట్టే పనికి నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా 3వ డివిజన్లోని పీఎస్ నగర్‌లో రూ.16.30 లక్షలతో చేపట్టిన పనికి సంబంధించిన టెండర్‌ను ఆమోదించారు. చిన్నచౌకులో సూర్య కాంప్లెక్స్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ ఎడమ వైపున డ్రైన్ నిర్మాణం చేయుటకు రూ.28.50 లక్షలతో పిలిచిన టెండర్‌ను ఆమోదించారు. సెంట్రల్ జైలు కాంపౌండ్ వాల్ పక్కన శ్రీరామ్ నగర్‌లో రూ.14.15లక్షలతో డ్రైన్ నిర్మాణం చేయుటకు అనుమతిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 8 ట్యాంకర్లలో ఒక ఏడాదిపాటు క్లోరిన్ గ్యాస్ సరఫరా చేయడానికి నిర్వహించిన టెండర్లను ఆమోదించారు. సాయిపేటలో వాటర్ ట్యాంక్ మెట్లు రూ.15లక్షలతో నిర్మించడానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో దాదాపు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దిరసవంచ పంచాయతీలో రాజుపేట, పెద్దిరాజుపల్లె, ఎస్సీకాలనీలో ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆనందంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలని, మా ఓట్లు ఆయనకే వేస్తామని వారు పేర్కొన్నారు. మొదటగా రాజుపేటలో పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సీసీ రోడ్లు ఉన్నాయని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ భూములు ఇచ్చేలా కృషి చేయాలని విన్నవించారు. అనంతరం పెద్దిరాజుపల్లె ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, కరెంట్, అంగన్‌వాడీ కేంద్రం, బస్‌షెల్టర్ వంటివి కావాలని తెలిపారు. పెద్దిరాజుపల్లెలో ఆర్‌అండ్ బీ రోడ్డుకు డ్రైనేజీ ఏర్పాటు, విద్యుత్ స్తంభాలు మార్పు వంటివి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సర్పంచ్ అమీర్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాలు నాగిపోగు గంగమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు కమిటీ సభ్యురాలు భర్త మణ్యం శంకర్‌రెడ్డి, పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకులు బిజివేముల మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, బి.సుబ్బారెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్మవారిపల్లెలో..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పంచాయతీ పరిధిలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. దిరసవంచ సచివాలయ పరిధిలో కమ్మవారిపల్లె, చౌటపల్లె, దిరసవంచ, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికి ఎమ్మెల్యే తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

నా మనవడు జగన్ ఎప్పటికీ సీఎంగా ఉండాలి

బ్రహ్మంగారిమఠం మండలంలోని దిరసవంచ పంచాయతీ రాజుపేట గ్రామంలో నివసిస్తున్న వారు దూదేకుల కులస్తులు. వారికి వైఎస్సార్ అంటే ఎంతో ప్రేమ. ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్న పథకాలపై మరీ ప్రేమ. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతుండగా.. ఆ పంచాయతీ సర్పంచ్ అమీర్‌బాషా నాయనమ్మ పీరమ్మ 110 ఏళ్ల వయసులో కూడా ఇప్పటికీ బాగానే తిరుగుతోంది. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి చిన్నప్పుడుగా ఉన్నప్పుడు నక్కలదిన్నెలో వారి ఇంట్లో ఆమె పని మనిషిగా చేసేది. ఎప్పటి నుంచో ఎమ్మెల్యేను చూడాలని అనుకునేది. నా కోరిక ఈ రోజు తీరింది నాయనా అంటూ ఆప్యాయంగా ఎమ్మెల్యేను పలకించింది. వృద్ధురాలిని ఎలా ఉన్నావు అని ఎమ్మెల్యే పలకరించగా.. నువ్వు చిన్నప్పుడు నేను మీ ఇంట్లో పని మనిషిగా ఉండే దానిని అనగానే.. ఎమ్మెల్యే ఆశ్చర్యపోయాడు. పలకరింపుల అనంతరం పీరమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ కుమారుడు జగన్ మా మనవడు లాంటి వాడని, ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలని, నువ్వు ఎమ్మెల్యేగా ఉండాలి అని కోరుకుంటున్నా నాయనా అంటూ చిరునవ్వులతో తెలిపింది.



ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డితో ఆప్యాయంగా పలకరిస్తున్న పీరమ్మ

సేవా మార్గం అభినందనీయం

ప్రొద్దుటూరు : పవిత్ర రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముస్లిం మైనారిటీ నాయకుడు వడ్ల దాదాపీర్, 23వ వార్డు కౌన్సిలర్ వడ్ల ఖలీల్ ఆధ్వర్యంలో మంగళవారం వార్డు పరిధిలోని 930 మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. వడ్ల దాదాపీర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్ల దాదాపీర్ కుటుంబం ప్రతి ఏడాది రంజాన్ సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వడ్ల దాదా పీర్ మాట్లాడుతూ 2019లో తన కుమారుడు ఖలీల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాడన్నారు. తాము కేవలం 100 కుటుంబాల్లో మాత్రమే ఉన్నామని, అయితే కులమతాలకు అతీతంగా వార్డు పరిధిలోని 930 మందికి రంజాన్ తోఫాలో భాగంగా చీరెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 25వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నూరి, వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్ బాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముస్లిం మైనారిటీ నాయకుడు వడ్ల దాదాపీర్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం 23వ వార్డు పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు.. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటి గోడకు ఎమ్మెల్యే అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మహిళకు చీరెను ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వడ్ల దాదాపీర్, కౌన్సిలర్ ఖలీల్



ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్లాస్టిక్ వాడుతున్న దుకాణాలపై దాడులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని దుకాణాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఆయా సచివాలయాల శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బ్యాగులు, డిస్పోజబుల్ గ్లాసులు స్వాధీనం చేసుకుని సంబంధిత దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణదారులు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు రవిశంకర్ రెడ్డి, సుధాకర్‌నాయక్, నాగేంద్రప్రసాద్, గంగయ్య, రమణ, జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పలుకుబడి లేకుండానే పథకాలు

ప్రొద్దుటూరు : ఎవరి పలుకుబడి అవసరం లేకుండానే ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 27వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తెలపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023–24 ఏడాదికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.అనూషా తెలిపారు. 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం అడ్మిషన్లు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఈ నెల 20 వరకు జరుగునని ఆమె పేర్కొన్నారు. అడ్మిషన్ కోసం విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, విద్యార్థి ఫొటో, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు తదితర పత్రాలు, అలాగే బడి బయట పిల్లలు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

‘బీజేపీని ఓడించడమే నిజమైన దేశభక్తి’

పోరుమామిళ్ల : దేశంలో ఏ రాష్ట్రంలో అయినా బీజేపీతో ప్రాంతీయ పార్టీ పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ నామరూపాల్లేకుండా పోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో సీపీఎం, సీపీఐ సంయుక్తాధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీతో ప్రాంతీయ పార్టీల పొత్తు ఉరితాడేనన్నారు. నిజమైన దేశభక్తి అంటే బీజేపీని ఓడించడమేనని అభిప్రాయపడ్డారు. పుల్వామా దుర్ఘటనలో 40 మంది సైనికులను పోగొట్టుకున్నామని, అందుకు కేంద్రప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ సభలో సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు భైరవప్రసాద్, పిడుగు మస్తాన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడారు. సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దెను దింపుదామంటూ ప్రచారం

ప్రొద్దుటూరు : స్థానిక నేతాజీ నగర్‌లో సీపీఐ, సీపీఎం నాయకులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెను దింపుదామంటూ మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని వారు తెలిపారు. ప్రజలకు వామపక్ష పోరు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, సురేష్, ఓబులేసు, వెంకటేష్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మసీదులకు రంజాన్ శోభ

మైదుకూరు : రంజాన్ పండుగను పురస్కరించుకుని మైదుకూరులోని మసీదులు విద్యుత్ కాంతులీనుతున్నాయి. పట్టణంలోని కడప రోడ్డులో షాహీ మసీదు (పెద్దమసీదు), ప్రొద్దుటూరు రోడ్డులోని మదీనా మసీదు, మార్కెట్ కూడలిలోని నూరాని మసీదు, ఇందిరమ్మ కాలనీలోని మసీదు-ఏ-ఉమర్‌లను పండుగ సందర్భంగా అలంకరించారు. మంగళవారం బడే రాత్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ నెల 22న రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు జరుపుకోనున్నారు.



మైదుకూరులోని షాహీ మసీదు

మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

కడప ఎడ్యుకేషన్ : మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం అని సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ యస్. కవిత అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ''మహిళల అక్రమ రవాణా- మాదక ద్రవ్యాల వినియోగం'' పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని చట్టాలొచ్చినా ఇప్పటికీ చాలా దేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉందన్నారు. వెట్టిచాకిరి, లైగింక అవసరాల కోసం పురుషులు, మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారన్నారు. మహిళలు ఇటువంటి వారి గురించి అవగాహ కలిగి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం వలన యువత భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసగా మారుస్తుందన్నారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా వెనకాడరన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా, వీటి చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ యస్.కవిత

అవగాహనతోనే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట

బద్వేలు అర్బన్ : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించుకుంటే వాటికి అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఐదవ రోజైన మంగళవారం స్థానిక కోటవీధిలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోలు బంక్‌లు, గ్యాస్ గోడౌన్‌లలో అగ్నిప్రమాద నివారణ యంత్రాలైన సీఓటు, డీసీపీ సిలిండర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్యాస్ లీకేజీ ప్రమాదాలను నివారించడం పూర్తిగా మనచేతుల్లోనే ఉందని, ఆ మేరకు నిబంధనలు పాటిస్తే ఎలాంటి గ్యాస్ ప్రమాదాలు జరగవని తెలిపారు. గ్యాస్ లీక్ అయ్యిందన్న అనుమానం తలెత్తినపుడు విద్యుత్ పరికరాలను ఆన్, ఆఫ్ చేయడం మంచిది కాదన్నారు. సెల్‌ఫోన్లు సైతం ఉపయోగించకూడదని సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు బాధితులను రక్షించే విధానాలను ప్రయోగాత్మకంగా సిబ్బంది చేసి చూపించారు. అలాగే సిబ్బందికి సీవోటు, డీసీపీ యంత్రాలు ఎలా వినియోగించాలో చూపించారు. కార్యక్రమంలో ఫైర్ మెన్లు, హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ రాము పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

వంటగ్యాస్ ప్రమాదాలపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక అధికారులు వంటగ్యాస్ ప్రమాదాలపై మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ మాట్లాడుతూ పరిశ్రమల్లోనూ, ఇళ్ల సమీపంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండే స్వభావం కలిగిన వస్తువులు, కాలడానికి అవకాశం ఉండేవాటిని వేర్వేరుగా నిల్వ చేయాలని చెప్పారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

పోరుమామిళ్ల : అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బంది కేంద్రాధికారి వసంతనాయక్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై గ్యాస్ గోదాం సిబ్బందికి, పెట్రోలు బంకులో పని చేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పెట్రోల్ బంకు పరిసర ప్రాంతాల ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు.



పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాలపై అవగాహన

దువ్వూరు : మండలంలోని కానగూడూరు గ్రామంలోని ఐఓసీఎల్ పెట్రోలు బంకు వద్ద మంగళవారం మైదుకూరు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి శివప్ప అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలో చేసి చూపించారు. అలాగే దువ్వూరులోని శ్రీసూర్య గ్యాస్ గోడౌన్ వద్ద ఎల్‌పీజీ సిలిండర్ల ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యోగులకు వివరించారు.

గాయని రూపకు బంగారు నంది అవార్డు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన గాయని, యాంకర్ ఎ.రూపదేవికు బంగారు నంది అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాదులోని హరిహర కళా భవనంలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ, నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న రూపదేవి

బద్వేలు వాసికి డాక్టరేట్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఫాతిమానగర్‌లో నివసించే ఎలిచెర్ల శివానందలహరిరెడ్డికి శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ఎస్‌కేయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.రఘునాథరెడ్డి పర్యవేక్షణలో 'బహుళస్థాయి హైబ్రీడ్ ఎన్‌క్రిప్షన్ ఉపయోగించి పటిష్టమైన సమాచార భద్రత, ప్రామాణీకరణను ఏవిధంగా సాధించాలన్న విషయం మీద రోబస్ట్ డేటా, సెక్యూరిటీ అండ్ అథెంటికేషన్ యూజింగ్ మల్టీలెవల్ హైబ్రీడ్ స్టాగోఫీ- యాన్ ఎంపిరికల్ స్టడీ ఆఫ్ హైబ్రీడ్ ఎన్‌క్రిప్షన్ యూసింగ్ సిమ్మెట్రిక్, అసిమ్మెట్రిక్ అండ్ హాషింగ్ అల్గారిథమ్స్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించగా ఎస్‌కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శివానందలహరిరెడ్డి మాట్లాడుతూ ఈ పరిశోధన ద్వారా ముఖ్యమైన సమాచారాన్ని సైబర్ నేరస్తులు దొంగలించకుండా సురక్షితంగా ఉంచి సమాచారం గోప్యత, సమగ్రతను కాపాడే ఓ దృఢమైన వ్యవస్థ అని అన్నారు.



శివానందలహరిరెడ్డి

ప్రతి వ్యక్తి ధర్మం ఆచరించాలి

బ్రహ్మంగారిమఠం : ప్రతి వ్యక్తి ధర్మం ఆచరించాలని చాపాటి సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చౌదరవారిపల్లెలో తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచార పరిషత్ కడప వారి ఆధ్వర్యంలో రామాయణం అనే అంశంపై ఆయన ప్రవచించారు. రాముడు ధర్మస్వరూపుడు, సద్గుణ సంపన్నుడు, ఆదర్శ పురుషుడు అని తెలిపారు. రామతత్వాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి, ఎల్.కొండారెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, ఎ.రామసుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న చాపాటి సుబ్బారెడ్డి

ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ పాఠశాలలలో అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెట్టడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కార్పొరేట్ పాఠశాలలలో పని చేసే ఉపాధ్యాయులకు అడ్మిషన్ల పేరుతో టార్గెట్‌లు ఇస్తున్నారని తెలిపారు. కొత్త అడ్మిషన్లు చేర్పించకపోతే ఇంక్రిమెంట్‌లు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.